క్లుప్తంగా

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు

వంగర: బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకుని వేసుకోవడం ద్వారా మేలు కలుగుతుందని మరువాడ ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తెలిపారు. మండల పరిధిలోని కింజంగి గ్రామంలో బీజామృతంతో విత్తనాల శుద్ధిపై మంగళవారం అవగాహన కల్పించారు. బీజామృతంతో శుద్ధి చేసుకున్న విత్తనాలను పొలంలో వేసుకుంటే మొలకశాతం పెరగడమే కాకుండా తెగుళ్లను తట్టుకునే పంట పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని ఖండ్యాం స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి మంగళవారం హాజరైన ఆయన.. అన్ని పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉపాధ్యాయులు మంచిగా విద్యను బోధించాలని తెలిపారు. విద్యార్థుల విద్యాప్రగతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ కార్యదర్శి మురపాక వెంకటరమణ, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్

రాజాం: మండలంలోని లక్ష్మీపురానికి చెందిన తాడ్డి చిన్నమ్మడు కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ మంగళవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా చిన్నమ్మడు మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న రాజేష్ ఆ గ్రామానికి చేరుకుని బాధిత కటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నాణ్యత పరిశీలన

బొబ్బిలిరూరల్: మండలంలోని కింతలివానిపేటలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు నాణ్యతను ఎంపీడీవో పి.రవికుమార్ మంగళవారం పరిశీలించారు. అనంతరం పనులు జరిగిన తీరు, పాటించిన నాణ్యతా ప్రమాణాలపై ఆరాతీశారు. ఆ తర్వాత బొబ్బిలి–పార్వతీపురం ఆర్ అండ్‌బీ రోడ్డు నుంచి గ్రామంలోకి 500 మీటర్ల మేర నిర్మించిన రోడ్డు నిర్మాణాన్ని ఆయన పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం

సంతకవిటి: మత్తు పదార్థాలతో జీవితం నాశనమవుతుందని, ప్రతిఒక్కరూ మద్యం, గంజాయి, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర సూచించారు. మండలంలోని గోళ్లవలస గ్రామంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు ఎక్కువగా ఫ్యాషన్ మాయలో పడి మద్యపానం, ధూమపానానికి అలవాటు పడుతున్నారని అది మంచిది కాదన్నారు. మంచి అలవాట్లుతో ఆదర్శవంతమైన వ్యక్తులుగా జీవించాలన్నారు. కార్యక్రమంలో సంతకవిటి ఏఎస్‌ఐ వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

రాజాం: ప్రజలకు అందుబాటులో ఉండి, వారికి సంతృప్తినిచ్చేలా సేవలు అందించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని బొద్దాం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన వివిధ సమస్యల పరిష్కారం నిమిత్తం ప్రజలు చేసుకున్న దరఖాస్తులు, వాటి పరిష్కార చర్యలపై ఆరాతీశారు. అలాగే మరుగుదొడ్ల సర్వే వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించాని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరం

సంతకవిటి: పాడి పరిశ్రమ అభివృద్ధికి పశువులకు సెక్స్ సోర్టెడ్ సెమెన్ విధానం దోహదపడుతోందని పశుసంవర్ధక శాఖ శ్రీకాకుళం డీడీ డీఎల్‌డీఏ సత్యప్రకాష్ తెలిపారు. మండలంలోని మండాకురిటి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి హాజరైన ఆయన.. పాడి ఆవులకు కృత్రిమగర్భం ఎలా చేయాలన్న దానిపై అవగాహన కల్పించారు. అనంతరం పలు పాడిఆవులకు గర్భకోశ సంబంధిత వ్యాధుల నివారణకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

రాజాం సిటీ: ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక పట్టణంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపవద్దని, సీటుబెల్టు పెట్టుకుని కారు నడపాలని తెలిపారు.

మద్యం కిక్కు.. నిబంధనలు తుక్కు..!



రాజాం రూట్‌లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణం

మద్యం పాలసీ నిబంధనలను కొంతమంది బేఖాతారు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతలే ప్రభుత్వ అనుమతి ఉన్న మద్యం దుకాణాలకు అనుబంధంగా బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారు. విచ్చలవిడిగా మద్యం సరఫరా చేసి, క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు అధికంగా వసూలు చేసి, పెద్ద ఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్సైజ్ పోలీసులు కొంతకాలంగా చేపడుతున్న తనిఖీల్లో పట్టుబడిన బెల్టుషాపుల నిర్వాహకులు, మద్యం సీసాలే దీనికి నిలువెత్తు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అవేమీ పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- నిబంధనలకు వ్యతిరేకంగా బెల్టుషాపుల నిర్వహణ
- అనుమతి ఉన్న దుకాణాల నుంచే జోరుగా మద్యం సరఫరా
- క్వార్టర్‌పై రూ.30 నుంచి రూ.50కు అధికంగా విక్రయం
- ప్రత్యేక నిఘాతో అక్రమ వ్యాపారులను పట్టుకుంటున్న పోలీసులు
- బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్న వారిపై మాత్రం చర్యలు శూన్యం

రామభద్రపురం: రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మద్యం అమ్మకాలను ప్రవేటు పరం చేయడంతో బొబ్బిలి నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. గతంలో ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే మద్యం అమ్మకాలు సాగేవి. ప్రస్తుతం చంద్రబాబు సర్కారు మద్యం దుకాణాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టింది. నియోజకవర్గంలో సగానికి పైగా షాపులను కూటమి నేతలే దక్కించుకున్నారు. ఇప్పుడు వారంతా నిబంధనలు బేఖాతరు చేస్తూ తమకు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. అంతా తమ ఇష్టం అన్నట్లు ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాలకు అనుబంధంగా బెల్టుషాపుల నిర్వహణను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా గ్రామాల్లో వీధికో బెల్టుషాపు తయారైంది. అధికార పార్టీ అండదండలు మెండుగా ఉన్నాయి.. ఎలా చేసినా తమకేమీ కాదన్నట్లు వారు బెల్టుషాపులకు జోరుగా మద్యం సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.



ఇటీవల బెల్టుషాపులకు తరలిస్తున్న మద్యంసీసాలను చూపిస్తున్న ఎస్‌ఐ వి.ప్రసాదరావు(ఫైల్)

తమ వద్దనే కొనాలని ఒత్తిడి..

మండలంలో ఆరు మద్యం దుకాణాలకు గాను నాలుగు షాపులు టీడీపీ నేతలకు రావడంతో మేనేజ్‌మెంట్ విషయంలో పొత్తు కుదరక వారి మధ్య భేదాభిప్రాయాలు పెరిగి, సిండికేట్ అవ్వలేదు. దీంతో వారిలో వారే పోటాపోటీగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. రండి బాబూ రండి తమ దుకాణంలోనే కొనండి అంటూ అటు మందుబాబులను ఇటు బెల్టుషాపుల వారిని పిలుస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. అలాగే గ్రామాల్లో వారికి సన్నిహితంగా ఉండే టీడీపీ నాయకులను ఉపయోగించి బెల్టుషాపులు ఏర్పాటు చేయడంలోనూ పోటీపడుతున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులకు తమ వద్ద అంటే తమ వద్దనే సరుకు తీసుకువెళ్లాలని ఫోన్లు చేసి మరీ ఒత్తిడి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం మనది మనల్ని ఎవరు అడుగుతారని వారే కుర్రాళ్లను పెట్టి మరీ పలు గ్రామాలకు మద్యంసీసాలను అక్రమంగా సరఫరా చేస్తున్నారు. దీంతో పల్లెల్లో విచ్చలవిడిగా బెల్టుషాపుల ఏర్పాటు జరుగుతోంది. దీనిపై మహిళలు పెద్దఎత్తున విమర్శలు గుప్పిస్తున్నారు.

వేలం పాటతో బెల్టుషాపులు..

గ్రామాభివృద్ధి పేరిట పలు గ్రామాల్లో వేలం పాట నిర్వహించి, బెల్టుషాపులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో గ్రామంలో ఒక బెల్టు దుకాణానికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిర్వాహకులు వేలం పాడి నిర్భయంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. వేలంపాట జరగని గ్రామాల్లో వీధివీధిన షాపులు తయారయ్యాయి.

నాణ్యత ఉత్తిదే..

నాణ్యమైన మద్యాన్ని సరసమైన ధరలకే అందజేస్తామన్న కూటమి నేతల హామీలు నీటిమూటలుగా మారాయి. నాణ్యమైన మద్యం, ధరల తగ్గింపు అనే మాటలు ఉత్తివేనని మందుబాబులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పాత రేట్లు ప్రకారమే అమ్ముతున్నారు. ఏవో కొన్ని నాణ్యత లేని మద్యంసీసాలు మాత్రం తక్కువ ధరకు ఇస్తున్నారు.

మందుబాబుల జేబుకు చిల్లు..

మండల కేంద్రాల్లోని మద్యం దుకాణాల వద్దకు వచ్చి, మద్యం కొనుగోలు చేయలేని వారు గ్రామాల్లోని బెల్టుషాపుల్లో విక్రయించే మద్యంపై అధారపడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుంటున్న బెల్టుషాపుల వారు అక్రమంగా మద్యం తెచ్చి క్వార్టర్ సీసాపై రూ.30 నుంచి రూ.50 వరకు అధిక ధరకు విక్రయిస్తున్నారు. ధర పెంచి విక్రయిస్తున్నా చేసేది లేక తప్పనిసరి పరిస్థితుల్లో మందుబాబులు మద్యం కొనుగోలు చేసి తాగుతూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు

నిబంధనలు గాలికొదిలేసి..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాల్లో ఓ వ్యక్తికి మూడు మద్యంబాటిళ్లు మాత్రమే అమ్మాలి. మద్యం షాపుల వద్ద తాగడానికి కూడా వీల్లేదు. అలాగే దుకాణాలను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకే తెరిచి ఉంచాలి. ప్రతీ షాపు వద్ద మద్యం ధరల బోర్డు పెట్టాలి. అయితే ఇవేమీ మద్యం దుకాణాల్లో అమలు కావడం లేదు. ఏ షాపు వద్ద చూసినా ధరల పట్టిక కనిపించడం లేదు. నిత్యం బెల్టుషాపులకు మద్యంసీసాల సరఫరా కొనసాగుతోంది

అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా..



మద్యం అక్రమ రవాణా జరగకుండా సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా పెట్టాం. బెల్టు దుకాణాలకు పట్టుకెళ్లి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేస్తున్నాం. మద్యం దుకాణాల యజమానుల ఒత్తిళ్లలకు తలొగ్గేది లేదు. బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారు ఎంతటి వారైనా ఊరుకునేది లేదు. మద్యం రవాణా చేస్తూ ఐదు సార్లు కంటే ఎక్కువ సార్లు పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్టు కింద కేసు నమోదు చేస్తాం.

– కె.నారాయణరావు సీఐ, రామభద్రపురం

బెల్టు దుకాణాలు నిర్వహిస్తే ఉపేక్షించం..



ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మద్యం దుకాణాలు నిర్వహించాలి. గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసినా, బెల్టుషాపులు నడుపుతున్నట్లు తెలిసినా ఉపేక్షించేది లేదు. బెల్టు దుకాణాల నిర్వహణ తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే గ్రామాల్లో నిఘా ఉంచాం. తరచూ దాడులు చేస్తున్నాం.

– పి.చిన్నంనాయుడు, ఎక్సైజ్ సీఐ, బొబ్బిలి

నెల రోజుల్లో 14 మందిపై కేసులు..

మద్యం దందాపై ప్రత్యేక నిఘా ఉంచిన పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు అక్రమార్కులను పట్టుకుని, అరెస్ట్ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఈ నెల రోజుల్లో బెల్టుషాపులకు అక్రమంగా మద్యం తరలిస్తున్న 14 మందిని ఎక్సైజ్ అధికారులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. సివిల్ పోలీసులు మరో 8 మందిని పటుకోవడంతో పాటు బహిరంగా ప్రదేశాల్లో మద్యం తాగిన 72 మందిని పట్టుకుని కేసులు నమోదు చేశారు. మద్యంతో పట్టుబడిన ఒక్కొక్కరి వద్ద 50 బాటిళ్ల పైబడే స్వాధీనం చేసుకున్నారు.

మరుగుదొడ్లు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక



రేగిడిలో అవగాహన కల్పిస్తున్న వైస్ ఎంపీపీలు అచ్చెన్నాయుడు, జగన్మోహనరావు



రాజాం: మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరిస్తున్న రాజాం రోటరీ క్లబ్ సభ్యులు కృష్ణారావు, పాపారావు



సంతకవిటి: బొద్దూరులో జూనియర్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ర్యాలీ



రాజాం సిటీ: ర్యాలీలో ఎంపీపీ రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ నర్సింహులు, తదితరులు



తెర్లాంలో ర్యాలీలో ఎంపీపీ ఉమాలక్ష్మి, ఎంపీడీవో రాంబాబు తదితరులు



బొబ్బిలి రూరల్: జగన్నాథపురంలో మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీలో సర్పంచ్ పద్మ, ఎంపీటీసీ తిరుపతిరావు తదితరులు



బొబ్బిలి రూరల్: వరల్డ్ టాయిలెట్ డే సందర్భంగా క్లాప్‌మిత్రలను సత్కరిస్తున్న ఎంపీడీవో రవికుమార్ తదితరులు



బాడంగిలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ తదితరులు

వాడవాడలా ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అవగాహన ర్యాలీల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజాసంఘాల నేతలంతా పాల్గొని, మరుగుదొడ్ల ఆవశ్యకత, వాటి వినియోగం, ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక అని, రాబోయే రోజుల్లో మరుగుదొడ్ల వినియోగం తప్పనిసరి అని తెలిపారు. ప్రతీ ఇంటి వారు మరుగుదొడ్డి నిర్మించుకుని, బహిరంగ మల,మూత్ర విసర్జన నిర్మూలనకు పాటుపడాలని పిలుపునిచ్చారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

నేడు పోలిపల్లి పైడితల్లి హుండీల ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి ఆలయంలో ఉన్న హుండీల ఆదాయం బుధవారం లెక్కించనున్నామని ఈవో బీవీ మాధవరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. దేవదాయ శాఖ విజయనగరం ఇన్‌స్పెక్టర్ పీవీ లక్ష్మి ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టనున్నామని, కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు.

ప్రింటర్ వితరణ

బొబ్బిలిరూరల్: మండలంలోని కలువరాయి గ్రామ అరుణాచల రమణ గణపతి ఆశ్రమం ట్రస్ట్ ప్రతినిధి రవికుమార్ అదే గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కంప్యూటర్ ప్రింటర్‌ను మంగళవారం వితరణ చేశారు. ప్రింటర్ లేని కారణంగా ఆన్‌లైన్ సేవలకు ఆటంకం కలుగుతోందనే విషయం తెలుసుకున్న ఆయన రూ.13 వేల విలువైన ప్రింటర్ కొనుగోలు చేసి, అందజేశారు. ఆయనకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బాడంగి: మండలంలోని కోటిపల్లి, వాడాడ గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఏవో కె.శిరీష మాట్లాడుతూ అపరాల సాగు చేపడుతున్న రైతులంతా అధిక దిగుబడులకు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పంటలు తెగుళ్ల బారినపడకుండా ఉండేందుకు వ్యవసాయ సిబ్బంది సూచించిన సూచనలు తప్పకుండా పాటించాలన్నారు.

బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి

రామభద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందజేస్తున్న రాయితీలు పొందాలంటే ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా) లింక్ తప్పనిసరిగా ఉండాలని ఎంపీడీవో రత్నం తెలిపారు. ఇదే విషయమై ఆమె స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని తన చాంబర్ నుంచి మాట్లాడుతూ లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు ఈ నెల 30వ తేదీ లోపు ఎన్‌పీసీఐ లింక్ చేయాలన్నా. ఆధార్ అనుసంధానం కూడా చేసుకోవాలన్నారు.

పాత పెన్షన్ విధానమే అమలుచేయాలి



పాత పెన్షన్ విధానం అమలే లక్ష్యంగా డిసెంబరు 10వ తేదీన చేపట్టబోయే చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధం కావాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు తవిటినాయుడు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన తెర్లాం మండల కేంద్రంలో సీపీఎస్ ఉద్యోగుల సమావేశం మంగళవారం నిర్వహించి, మాట్లాడారు. సీపీఎస్(కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)ను రద్దు చేసి, ఓపీఎస్(ఓల్డ్ పెన్షన్ స్కీమ్)ను కొనసాగించాలని కోరుతున్నా..ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

– తెర్లాం

ఉద్యోగ భద్రత కల్పించాలి



తమకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేయాలని 104 వాహన ఉద్యోగులు కోరుతున్నారు. ఇదే విషయమై బాడంగి మండలంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, జీవో నంబరు 7 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను తక్షణమే మంజూరు చేయాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పీఎఫ్(ప్రావిడెంట్ ఫండ్)ను చెల్లించాలని, బీమా సదుపాయం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జెడ్పీటీసీని వారు కోరారు.

– బాడంగి

అధ్వానంగా రోడ్లు





అధ్వానంగా రోడ్లు ఉండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాజాం నుంచి చీపురుపల్లి వెళ్లే రోడ్డు.. ఉల్లివలస వరకు గుంతలమయమై చాలా ప్రమాదకరంగా కనిపిస్తోంది. రాజాం గాయత్రి కాలనీ నుంచి పెనుబాక, బొద్దాం, బొండపల్లి జంక్షన్ తదితర ప్రాంతాల్లోని రోడ్లు సైతం శిథిలావస్థకు చేరుకోవడంతో అటువైపుగా వెళ్లే వారంతా నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి, కనీసం గుంతలనైనా పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

– రాజాం

విద్యార్థులకు అభినందనలు

రేగిడి: జోనల్ మీట్ ఆటల పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన స్థానిక ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులను సిబ్బంది మంగళవారం అభినందించారు. వంగర మండలంలోని కొప్పరలో ఇటీవల జరిగిన క్రీడాపోటీల్లో సీనియర్ విభాగంలో జరిగిన చెస్ పోటీల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్ విద్యార్థి పి.అభిషేక్, జూనియర్ విభాగంలో క్యారమ్స్ పోటీల్లో కె.అనిల్, జి.తరుణ్‌లు, జూనియర్ విభాగంలో డిస్క్ త్రోలో బి.కరణ్, జూనియర్ విభాగంలోని కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థులు సత్తాచాటారని ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు తెలిపారు. వీరంతా ఈ నెల 26వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

డిసెంబరు 8న భగవద్గీత శ్లోకాల పోటీలు

రాజాం సిటీ: స్థానిక వికాస తరంగిణి ఆధ్వర్యంలో డిసెంబరు 8వ తేదీన భగవద్గీత 12వ అధ్యాయం శ్లోకాలపై పోటీలు నిర్వహించనున్నామని సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీపీ రమణమూర్తి తెలిపారు. మండలంలోని పొగిరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేయాలని ప్రధానోపాధ్యాయుడు సత్యారావుకు భగవద్గీత పుస్తకాలు మంగళవారం అందించారు. ఆయన మాట్లాడుతూ శిశు విభాగంలో మూడు నుంచి ఐదేళ్ల వయసు పిల్లలంతా మొదటి ఐదు శ్లోకాలు చూడకుండా చెప్పాల్సి ఉంటుందన్నారు. రెండో తరగతి నుంచి ఐదో తరగతి విద్యార్థులు మొదటి పది శ్లోకాలు చూడకుండా చెప్పాలన్నారు. 6, 7 తరగతుల విద్యార్థులు మొదటి 20 శ్లోకాల్లో ఏది అడిగినా చెప్పాలన్నారు. ఉన్నత విభాగంలో పోటీల్లో 20 శ్లోకాల్లో అర్థాలతో సహా చెప్పాలన్నారు. పోటీల్లో పాల్గొనాలనుకునే విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు అందిస్తామన్నారు.

ఎకరాకి 26 క్వింటాళ్ల దిగుబడి

రేగిడి: మండలంలోని అక్కన్నఅగ్రహారం గ్రామంలో రైతు లంక మోహనరావు వరి పొలంలో మంగళవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. నిర్దేశిత కొలతల్లోని వరిచేనును కోసి, ప్రయోగం చేయగా, ఎకరాకి 26 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్లు అంచనా వేశామని ఏఎస్‌వో ఏసుబాబు తెలిపారు. ఇప్పటి వరకు 80 పంటకోత ప్రయోగాలు పూర్తి చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో చాందిని తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి

బొబ్బిలి: అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలని వక్తలు ఆకాంక్షించారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్ గేమ్ నిర్వహించడంతో పాటు విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు పెట్టారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేస్తామని లైబ్రేరియన్ స్వర్ణలత తెలిపారు.

తెర్లాం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, వాటి విశిష్టతలు వివరించారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని వస్త్రపురి కాలనీలో నివాసముంటున్న ఓ వివాహిత అదృశ్యంపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వై.రవికిరణ్ వెల్లడించారు. ఎప్పటిలాగే ఈ నెల 18వ తేదీన విధులకు వెళ్లి, సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తకు ఇంట్లో ఉండే తన భార్య కనిపించలేదు. చుట్టుపక్కల వారిని ఆరాతీయగా అదేరోజు మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిందని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆమె ఇంటికి రాకపోవడంతో అతడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.